సాక్షి
కుమురం భీం
గురువారం । 31 । అక్టోబర్ । 2024

గరిష్టం/కనిష్టం
32.0 /23.7

వాతావరణం
ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

ఆసిఫాబాద్‌రూరల్: స్పెషల్ ఎస్జీటీ పోస్టుల భర్తీకి జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన బుధవారం ముగిసిందని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు తెలిపారు. మొత్తం 14 పోస్టులకు 27 మంది హాజరు కావాల్సి ఉండగా 23 మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పోరాటం

• ఎమ్మెల్యే కోవ లక్ష్మి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పార్టీ తిరుగులేని పోరాటాలు సాగిస్తుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వినతితో ఈఆర్సీ చైర్మన్ విద్యుత్ బిల్లుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ అని చెబుతూనే.. మరోవైపు చార్జీలు పెంచేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ప్రజలపై రూ.18,500 కోట్ల భారాన్ని మోపకుండా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఒత్తిడి తీసుకువచ్చామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు పోరాడతామని స్పష్టం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒకేగూటి పక్షులని, కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులను బీజేపీ ప్రశ్నించడం లేదన్నారు. సమావేశంలో నాయకులు అలీబిన్ అహ్మద్, బుర్స పోచయ్య, రవీందర్, భీమేశ్, బలరాం, లక్ష్మణ్, బాబురావు, అహ్మద్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులు, ఉద్యోగులకు భద్రత కల్పించాలి


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పనిస్థలాల్లో మహిళా కార్మికులు, ఉద్యోగులకు భద్రత కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి చాంద్‌పాషా డిమాండ్ చేశారు. అభయ కేసులో సీబీఐ దర్యాప్తు పూర్తిచేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళా ఉద్యోగులు, కార్మికులపై లైంగిక హింస పెరిగిందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు అండగా పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందం, తిరుపతి, హెడ్ నర్సులు, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవనం నిర్మించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని కోరుతూ విద్యార్థులు బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అంతకు ముందు జూనియర్ కళాశాల నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ రమేశ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ముజామీలుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రస్తుత కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. సుమారు 707 మంది విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అలాగే ఈ ఏడాది ఎంపీసీ(ఉర్దూ మీడియం) కోర్సు తొలగించారని, కంప్యూటర్ ల్యాబ్, స్వీపర్, వాచ్‌మెన్, అటెండర్, తాగునీటి వసతి లేదని తెలిపారు. అధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేసి, సమస్యలు పరిష్కరించాలని కోరారు.

దీపం.. ఐశ్వర్యం



• నేడు వెలుగుల పండుగ దీపావళి
• ధనలక్ష్మీ పూజలు, నోములు, వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు
• టపాసుల దుకాణాల వద్ద ప్రజల సందడి


జిల్లా కేంద్రంలో ప్రమిదలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఏ శుభకార్యమైనా జ్యోతి ప్రజ్వలనతోనే మొదలవుతుంది. దీపాన్ని జ్ఞానానికి ప్రతీకగా చెప్పుకుంటాం. చీకటిని పారదోలి వెలుగులు నింపుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకొంటారు. జిల్లా ప్రజలు గురువారం వెలుగుల పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇళ్లలో ప్రత్యేకంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేయనున్నారు. వ్యాపారులు లక్ష్మీపూజలు చేసి దుకాణాలను విద్యుత్ కాంతులతో అలంకరించనున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ ఏడాది టపాసుల దుకాణాలు వెలిశాయి. ప్రత్యేకంగా తయారు చేసిన ప్రమిదలు విక్రయిస్తున్నారు. పండుగ నేపథ్యంలో మార్కెట్లు సందడిగా మారాయి.

మూడు రోజులపాటు పూజలు

బంగారం కొనుగోళ్లు.. ధనలక్ష్మీ దేవి పూజలు, నోములు, వ్రతాలు, విద్యుత్ కాంతులతో అలంకరించిన గృహాలు, టపాసుల మోతల సమాహారమే దీపావళి పండుగ. త్రయోదశి రోజు ప్రారంభమై నరక చతుర్దశి, దీపావళి పేరుతో మూడు రోజులపాటు పండుగ జరుపుకొంటారు. ముందుగా ధనత్రయోదశి రోజు బంగారం కొనుగోలు చేసి వేడుకలు ప్రారంభించారు. బుధవారం చతుర్దశి రోజు నరకసుర దహనం చేయగా.. నేడు ధనలక్ష్మీదేవి పూజలు చేయనున్నారు. వ్యాపార గృహ సముదాయాల్లో పూజలు చేసిన అనంతరం టపాసులు కాలుస్తారు. 'దీపేన సాధ్యతే సర్వం' అనే నానుడి ఉంది. దీపాలను వెలిగించి దైవాలను ఆరాధించడం ద్వారా సమస్త దోషాలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. అమావాస్య తిథి లక్ష్మీదేవికి ప్రీతిపాత్రం కావడంతో భక్తులు దీపాలు వెలిగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు.

రాక్షస పీడ వదిలిందని..



తిథులన్నింటిలో అసురుడి పేరుతో ఏర్పడిన ప్రత్యేకత నరక చతుర్దశికే ఉంది. స్త్రీలతో అమర్యాదగా ప్రవర్తించే వారికి శిక్ష విధించి తీరాలని ఈ పండుగ సందేశం ఇస్తుంది. కృష్ణుడితో కలిసి యుద్ధానికి వెళ్లిన సత్యబామ నరకాసురుడిని వధిస్తుంది. అప్పటినుంచి రాక్షస పీడ వదిలిందని ప్రజలు దీపావళి జరుపుకుంటున్నారు.

– ఇందారపు మధుకర్‌శర్మ, పురోహితులు


కాగజ్‌నగర్‌లో నరకాసుర దహనం

ఘనంగా నరకాసుర దహనం

కాగజ్‌నగర్‌రూరల్: నరక చతుర్దశిని పురస్కరించుకుని పట్టణంలోని పొట్టిశ్రీరాములు చౌరస్తాలో బుధవారం నరకాసుర దహనం ఘనంగా నిర్వహించారు. త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ నరకాసుర వధతో మనలోని దుష్టశక్తులను పారదోలాలన్నారు. అనంతరం నరకాసుర ప్రతిమ తయారు చేసిన దాసరి లక్ష్మణ్, పంకజ్ అసావాలను జీయర్‌స్వామి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్, వ్యాపారులు, భక్తులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి

అప్రమత్తంగా ఉంటేనే సంబురం

• ఆదమరిస్తే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం
• స్వీయ జాగ్రత్తలే రక్ష

కెరమెరి(ఆసిఫాబాద్): ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకొనే పండుగ దీపావళి.. జిల్లావ్యాప్తంగా ప్రజలు గురు, శుక్రవారాల్లో వేడుకలు నిర్వహించనున్నారు. దీపాలు, విద్యుత్ వెలుగులతో ఇళ్లు, షాపులు అలంకరించుకుంటారు. టపాసులు కాలుస్తూ ఆనందంగా గడుపుతారు. ఈ సమయంలో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రజలు స్వీరక్షణ చర్యలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు. ముఖ్యంగా తల్లిదండ్రులు చిన్నారులను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. టపాసుల మోత ప్రభావం మన చెవులపై పడుతుంది. శబ్ద తీవ్రత 90 డెసిబెల్స్ దాటితే రక్షణ చర్యలు తీసుకోవాలి.

• టపాసులు కాల్చే సమయంలో సింథటిక్ దుస్తులు కాకుండా బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
• సగం కాలిన టపాసులను ముట్టుకోకుండా ఆర్పివేయాలి.
• గుడిసెలు, మంటలు అంటుకునే వస్తువుల వద్ద టపాసులు కాల్చొద్దు.
• అనుభవం లేనివారు విద్యుత్ పనులు చేయొద్దు.
• చేతులతో దీపాలు, కొవ్వొత్తులు పట్టుకుని బాంబులు కాల్చడం ప్రమాదకరం.


కెరమెరిలో టపాసుల కొనుగోళ్లు

విక్రయ కేంద్రాల్లో నిబంధనలివి..

• ఖాళీ స్థలాల్లో మాత్రమే టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఒకేచోట 50కి మించి ఏర్పాటు చేయొద్దు.
• వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
• అగ్ని ప్రమాదాల నివారణకు ఏర్పాట్లు చేసుకోవాలి. 200 లీటర్లతో రెండు బకెట్ల నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచాలి.
• దుకాణాల మధ్య కనీసం రెండు నుంచి మూడు మీటర్ల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
• సిగరేట్, బీడీలు తాగకుండా సూచన బోర్డులు ఏర్పాటు చేయాలి.

'సమగ్ర' సర్వేకు సన్నద్ధం

• నవంబర్ 6 నుంచి సామాజిక, ఆర్థిక, కులగణన
• జిల్లాలో 1400 మంది ఎన్యూమరేటర్ల నియామకం
• ఇంటింటికీ తిరుగుతూ 56 అంశాలతో వివరాల సేకరణ


సిర్పూర్(టి)లో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న రెవెన్యూ అధికారి

ఆసిఫాబాద్: సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రభుత్వం సన్నద్ధమైంది. నవంబర్ 6 నుంచి సామాజిక, ఆర్థిక, కుల గణన ప్రారంభం కానుంది. సర్వే మార్గదర్శకాలను ఇప్పటికే విడుదల చేసిన ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులంతోపాటు ఇతర అంశాల ఆధారంగా వివరాలు సేకరించనున్నారు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. నిష్ణాతులైన డాటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దిత నమూనాలో వివరాలు నమోదు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 29న సర్వే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఎన్యూమరేటర్లకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

56 అంశాలతో సర్వే

ఎన్యూమరేటర్లు గడపగడపకూ వెళ్లి 56 అంశాలతో కూడిన వివరాలు సేకరిస్తారు. యజమాని, కుటుంబ సభ్యులు, కులం, వయస్సు, మాతృభాష, ఆధార్, మొబైల్ నంబర్, మానసిక స్థితి, వైకల్యం, విద్య, చదువు మానివేస్తే ఏ తరగతి అనేది నమోదు చేస్తారు. ప్రస్తుతం చేస్తున్న పని, ఉద్యోగం, స్వయం ఉపాధి, వ్యాపారం, పారిశ్రామిక వేత్త అయితే వార్షిక టర్నోవర్.. వేతన కార్మికులైతే ఏ రంగంలో పనిచేస్తున్నారు.. సంప్రదాయ కులవృత్తుల వివరాలు సేకరిస్తారు. అనారోగ్యం, వార్షిక ఆదాయం, ఆస్తులు, బ్యాంకు అప్పుల వివరాలు కూడా ఫార్మట్ ప్రకారం నమోదు చేస్తారు. ఆదాయపు పన్ను చెల్లింపు దారులైతే బ్యాంకు ఖాతా, భూమి ఉంటే ధరణి పాస్‌పుస్తకం నంబర్, పట్టాభూమి, అసైన్డ్ భూమి, నీటి పారుదల సౌకర్యం, కౌలు భూమి సాగు చేస్తే ఆ వివరాలు సైతం సేకరించనున్నారు. ఒకవేళ రిజర్వేషన్‌తో విద్య, ఉద్యోగ తదితర ప్రయోజనాలు పొందితే వివరాలు, ఐదేళ్లుగా లబ్ధిపొందిన పథకాల పేర్లు, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందారా.. కుటుంబ సభ్యుల రాజకీయ నేపథ్యం గురించి కూడా ఆరా తీస్తారు. కుటుంబంలోని ఎవరైన ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలస వెళ్తే వివరాలు, వలసకు కారణాలు నమోదు చేస్తారు. కుటుంబానికి సంబంధించిన అప్పులు, పశుసంపద, స్థిరాస్తి వివరాలు, రేషన్ కార్డు నంబర్, నివాస గృహ విస్తీర్ణం, తాగునీటి వసతి, ఇంటి విస్తీర్ణం, ఇంట్లో మరుగుదొడ్ల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య తదితర వివరాలు సేకరిస్తారు.

1400 మంది ఎన్యూమరేటర్లు

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 1,20,420 గృహాలు ఉండగా.. జనాభా 5,15,820 ఉంది. ప్రస్తుత కులగణన సర్వే నిర్వహించేందుకు జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల్లో 1400 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. ఇందులో 15 శాతం అదనపు సిబ్బంది ఉంటారు. శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు నవంబర్ 3లోగా జాబితా సిద్ధం చేసుకుని 6 నుంచి సర్వే ప్రారంభిస్తారు. జిల్లాను 1115 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించారు. 2011లో జనగణనలో ఉపయోగించిన మ్యాపుల సాయం తీసుకుంటారు. ప్రతీ మండలంలో గరిష్టంగా 50 మంది ఎన్యూమరేటర్లను నియమిస్తారు.

ప్రజలు సహకరించాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీలు, ఇతర వెనుకబడిన కులాల అభ్యున్నతికి ప్రణాళికలు అమలు చేసేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతుంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, ఇతర అంశాల ఆధారంగా వివరాలు సేకరించనున్నాం. జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, 335 గ్రామ పంచాయతీల్లో నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభమవుతుంది. ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలి.

– వెంకటేశ్ దోత్రే, కలెక్టర్

అటవీ అధికారులను సస్పెండ్ చేయాలి


నాగమ్మ చెరువులో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, నాయకులు

• ఎమ్మెల్యే హరీశ్‌బాబు

సిర్పూర్(టి): మండలంలోని బెంగాళీ క్యాంపు కాలనీకి చెందిన ఏడుగురు రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, కళ్లకు గంతలు కట్టి చితక్కొట్టిన సిర్పూర్(టి) ఎఫ్‌ఆర్‌వో, రెబ్బెన ఎఫ్‌ఎస్‌వోలను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. బెంగాళీ క్యాంపు కాలనీలో బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పంటలు రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారన్నారు. ఈక్రమంలో అడవి పంది కేసులో రైతులను రిమాండ్‌కు తరలించడం అన్యాయమన్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోని పక్షంలో రేంజ్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

నాగమ్మ చెరువులో చేపపిల్లలు విడుదల

బస్టాండ్ సమీపంలోని నాగమ్మ చెరువులో బుధవారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేపపిల్లలను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విడుదల చేశారు. సంక్షేమ ఫలాలను మత్స్యకారులు వినియోగించుకోవాలని సూచించారు. నాగమ్మ చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు పోశం, నాయకులు సత్యనారాయణ, నానయ్య, నేరెళ్ల అశోక్, ఎల్ములే అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

• ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

రెబ్బెన(ఆసిఫాబాద్): పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు వివరాలను రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రోజువారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులతోపాటు రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూం పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్‌శాఖ బాధ్యతాయుతమైన వ్యవస్థ అని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. నిందితులకు శిక్షపడేలా భౌతిక సాక్ష్యాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు పెట్రోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. రహదారి వెంట డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం కోర్టు విధులు నిర్వర్తిస్తున్న ఎల్.ఉమేశ్వర్‌కు నగదు రివార్డు అందించి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ బుద్దె స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బంది వస్తువులు పరిశీలిస్తున్న ఎస్పీ

విద్యుత్ వినియోగదారులకు టోల్‌ఫ్రీ నంబర్

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోగదారులకు విస్తృతమైన సేవలందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1912 అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వాసుదేవ్ టీజీఎన్‌పీడీఎస్ పరిధిలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి టోల్‌ఫ్రీ సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన అనంతరం సంబంధిత అధికారితో పాటు ఫిర్యాదుదారుడికి సమాచారం అందించి, సాంకేతిక ఆధారంగా సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం మాట్లాడుతూ జిల్లా పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి 13 నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వేతనాలు విడుదల చేయాలని కోరారు. పార్వతి, లక్ష్మి, అన్సర్, శారద, తిరుపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు



నిందితులతో ఎస్సై సుగుణాకర్

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నాగార్జున కాలనీలోని ఓ ఇంటిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పూదరి సతీశ్, మూసక ప్రభాకర్, దాసరి చంద్రమౌళి, ఎడ్ల రామారావులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30,140 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నజ్రూల్‌నగర్ ఘటనలో నిందితుల అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.5లో ఈనెల 26న జరిగిన ఘటనలో బుధవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామానుజం, కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీసు విధులను ఆటంకపర్చినందుకు మనీష్ మానిక్‌దాస్, దెబాశిష్ మండల్, బుద్ధేశ్వర్‌రాయ్‌లను అరెస్టు చేశామన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేసేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 30 మంది విద్యార్థునులకు ఒక్కసారిగా కడుపు నొప్పితో కూడిన విరేచనాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స అనంతరం విద్యార్థినులు పూర్తిగా కోలుకున్నట్లు వైద్యుడు వినయ్ తెలిపారు. విద్యార్థినులు అస్వస్థతకు గల కారణాలు తెలియరాలేదు.

వృద్ధుడి ఆత్మహత్య

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన సర్వర్ లాలూ(59) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మధుకర్ బుధవారం తెలిపారు. గత కొద్ది రోజులుగా లాలూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు నితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి చేరిన గణేశ్ మృతదేహం



గణేశ్ మృతదేహం

లక్ష్మణచాంద: గత వారం రోజుల క్రితం దుబాయ్‌లో మృతి చెందిన ఆకుల గణేశ్ (25) మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల పుష్పలత –పెంటయ్య దంపతుల ఏకైక కుమారుడు గణేశ్ రెండేళ్ల కిందట బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. ఈ నెల 22న కంపెనీలో పని చేసే సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి చొరవతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. భార్య జయశ్రీ, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య గణేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

అతిథులొస్తున్నాయి..!



ఈ పక్షిపేరు ఎరుపు అవదావత్ లేదా రెడ్ మునియా పక్షి. ఈ పక్షి ఎస్ట్రీల్డిడే సంతతికి చెందిన పిచ్చుక. ఇది ఉష్ణమండలంలోని ఆసియా ప్రాంతంలో గడ్డి ఎక్కువగా ఉన్న చోట ఉంటుంది. శీతాకాలంలో తమ సంతతిని పెంచుకోవడానికి ఇటీవల కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అడవుల్లో గల నీటి కుంటలో కనిపించింది.



ఇది ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్. ఆసియాకు చెందిన మధ్యస్థపరిమాణ ప్యాసెరస్ పక్షి. భారత ఉపఖండం, ఆసియా దేశాలలో, మయన్మార్ ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తుంది. దీని తలపై నల్లని కిరీటం ఆకారంలో జుట్టు ఉంటుంది. ఇది 19 –22 సెం.మీ పొడవు ఉంటుంది. శీతాకాలం ప్రారంభమవుతున్నందున జన్నారం అటవీ డివిజన్‌లోకి వలస వచ్చింది.

భూమిమీద కొన్ని వేల రకాల పక్షి జాతులు ఉన్నాయి. మనుగడ సాగించేందుకు పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తుంటాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌కు సైతం ఏటా శీతాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల పక్షులు వలస వస్తుంటాయి. ప్రస్తుతం శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసియాలోని ఇతర దేశాల నుంచి పక్షులు అతిథులుగా వస్తున్నాయి. ఈ పక్షులు శీతాకాలంలో ఇక్కడే ఉండి తమ సంతతిని పెంచుకుని తిరిగి వాటి ప్రాంతాలకు వెళ్తాయని అధికారులు చెబుతున్నారు. – జన్నారం

- కవ్వాల్ టైగర్‌జోన్‌లో పక్షుల కిలకిలలు
- ఏటా శీతాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వలస
- అటవీ ప్రాంతంలో 300 రకాల పక్షులు



బ్లాక్ వింగ్‌డ్ కైట్



క్రస్టర్డ్ సర్పెంట్ ఈగల్



ఇండియన్ కోర్మోరెంట్

300 రకాలకు పైగా పక్షులు

వన్యప్రాణులకు నిలయంగా మారిన కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం ఇప్పుడు పక్షులకు అవాసంగా మారుతోంది. వన్యప్రాణుల సంరక్షణతో పాటు పక్షి జాతుల సంరక్షణపై అటవీ అధికారులు దృష్టి సారించారు. బర్డ్స్ ఫెస్టివల్‌లో భాగంగా జన్నారం అడవులకు వచ్చిన పక్షి ప్రేమికులు పలు రకాల కొత్త పక్షులను గుర్తించారు. ఈ పక్షుల విశేషాలను అధికారులకు తెలియజేశారు. ఈ క్రమంలో కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశంలో 300లకు పైగా పక్షి జాతులున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 200 రకాల పక్షుల వివరాలను సేకరించారు.

కళ్లముందే అనేక పక్షి జాతులు..

జన్నారం అటవీ డివిజన్‌లో కొంగలు, ఉలీ నెక్‌డ్ స్పార్క్, పిచ్చుకలు, చిలుకలు, వడ్రంగి పిట్ట, చికుముకి పిట్ట, పాలపిట్ట, వల్చర్, అడవి పావురాలు, పిచ్చుకలు, గద్దలు, కింగ్‌ఫిషర్, కోకిల, గోరింకలు, గువ్వలు, బ్లాక్ నెక్‌డ్ పక్షులు ఇలా అనేక రకాల పక్షులు ఉన్నాయి. వీటితో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన 50 రకాల పక్షుల జాతులను కవ్వాల్ టైగర్‌జోన్‌లో గుర్తించినట్లు అధికారులు తెలిపారు.



ట్రికోలర్డ్ మోనియా



వైట్ ఐ బుజర్డ్ పక్షి

మొదలైన వలసలు..

ప్రతీ సంవత్సరం మాదిరి ఈ ఏడాది కూడా పక్షుల వలసలు ప్రారంభమయ్యాయి. ఏటా అక్టోబర్ చివరి వారం నుంచి జనవరి వరకు వివిధ దేశాల నుంచి పక్షులు వచ్చి సంతతిని పెంచుకుంటాయి. అడవిలో నీటి ఆవాసాలు, గడ్డి క్షేత్రాలు ఉండటం వల్ల పక్షులు పెద్ద సంఖ్యలో వలస వస్తున్నాయి. జన్నారం డివిజన్‌లో బైసన్‌కుంట, మైసమ్మ కుంట, ఘనిషెట్టి కుంట, కల్పకుంట, ఉట్నూర్ డివిజన్ ఉడుంపూర్ గాదం చెరువు, కడెం ప్రాజెక్టు, కాగజ్‌నగర్ ప్రాంతాలలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు.



ఆసియన్ పీడ్ స్టార్లింగ్



స్మాల్ మినీవెట్



చేంజేబుల్ హాక్ ఈగల్

పక్షులను గుర్తిస్తున్నాం



ప్రతీ సంవత్సరం వలస పక్షులు వస్తుంటాయి. తిరిగి వెళ్తుంటాయి.ఏటా పక్షులను గుర్తిస్తాం. ఈ సంవత్సరం పక్షుల వలసలు ప్రారంభమయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పక్షులు తిరిగి ఫిబ్రవరిలో వెళ్తాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం టైగర్‌జోన్ వ్యాప్తంగా వివిధ రకాల పక్షులను గుర్తిస్తున్నాం.

– జోగు ఎల్లం, ఎన్‌టీసీఏ సభ్యుడు

వలసలు ప్రారంభమయ్యాయి



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ప్రాంతాలకు వివిధ దేశాల నుంచి పక్షులు వలసలు వస్తుంటాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో సంతతి పెంచుకుని తిరిగి వెళ్తాయి. ఈ సంవత్సరం చలి తక్కువగా ఉన్నందున ఇప్పుడే వలసలు ప్రారంభమయ్యాయి. నవంబర్ మొదటి వారం వరకు అన్ని రకాల పక్షులు ఇక్కడికి చేరుకుంటాయి. పక్షుల రక్షణ కోసం అటవీశాఖ కృషి చేస్తుంది.

– శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

తండ్రి మృతి.. కుమారుడి నిరసన

బెల్లంపల్లి: డ్రెయినేజీని మూసివేయడంతో వచ్చిన దుర్వాసన వల్లే తన తండ్రి, సింగరేణి రిటైర్డు కార్మికుడు దయానంద్ ప్రసాద్ పాండే (82) మృతి చెందాడని కల్యాణ్‌పాండే బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీలోని 29వ వార్డు బజారు ఏరియా డబ్బుసేట్‌లైన్‌లో దయానంద్‌ప్రసాద్ పాండే నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో వీధి లోని డ్రెయినేజీని తాత్కాలికంగా మున్సిపల్ సిబ్బంది మూసివేశారు. దీంతో మురికి కాలువలో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండగా, దుర్వాసనతోనే తన తండ్రి దయానంద్‌ప్రసాద్ పాండే మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడని, డ్రెయినేజీని మూసి ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్యాణ్‌పాండ్ ప్లకార్డు పట్టుకుని ఆందోళన చేశాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కాగా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కల్యాణ్‌పాండే ఫిర్యాదు చేశాడు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కల్యాణ్‌పాండే

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

నార్నూర్: మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన కుమ్ర రేణుకబాయి(30) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలంలోని ఉషేగాం గ్రామానికి చెందిన తొడసం పార్వతిబాయి –రాంజీ దంపతుల పెద్ద కుతూరు తొడసం రేణుకబాయిని నార్నూర్ మండలం రాజుగూడ గ్రామానికి చెందిన కుమ్ర అంకోష్‌కు ఇచ్చి 15 ఏళ్ల క్రితం వివాహం చేశారు. ఆమెకు గత కొన్నేళ్ల నుంచి మతి స్థిమితం లేదు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన రేణుకబాయి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం రాజులగూడ గ్రామ శివారులో ఉన్న బావిలో రేణుకబాయి మృతదేహం లభ్యమైంది. పార్వతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

దండారీ వేళ కుటుంబంలో విషాదం

- పురుగుల మందు తాగిన అన్నదమ్ములు
- అన్న మృతి, చికిత్స పొందుతున్న తమ్ముడు



మర్సుకోల న్యానేశ్వర్ (ఫైల్)

జైనూర్: ఏజెన్సీ ప్రాంతాల్లో దండారీ ఉత్సవాలు ఘనంగా జరుగుతుండగా మండలంలోని గూడమామడ గ్రామానికి చెందిన ఒక కుటుంబంలో మాత్రం విషాదచాయలు అలుముకున్నాయి. దండారీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్ధమైన ఇద్దరు అన్నదమ్ములు చిన్న గొడవతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గూడమామడ గ్రామానికి చెందిన మర్సుకోల గంగారాంకు ఇద్దరు కుమారులు న్యానేశ్వర్, శంకర్ ఉన్నారు. గూడమామడ గ్రామానికి చెందిన దండారీ సోనాపూర్‌కు వెళ్తుండగా వీరిద్దరు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఇంట్లో ఉన్న పశువులను మేతకు తీసుకెళ్లేందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా మనస్తాపానికి గురైన వీరు మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటి ఆవరణలో వాంతులు చేసుకోవడంతో గమనించిన తండ్రి ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే మర్సుకోల న్యానేశ్వర్(24) మృతి చెందగా, మెరుగైన వైద్యం కోసం మర్సుకోల శంకర్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



స్వప్న బిశ్వాస్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ –సిర్పూర్ (టి) ప్రధాన రహదారిపై పర్దాన్‌గూడ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్వప్న బిశ్వాస్ (19), సీమా బిశ్వాస్ సమీప బంధువులు. కాగజ్‌నగర్ నుంచి ద్విచక్ర వాహనంపై సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ గ్రామానికి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న స్వప్న బిశ్వాస్ కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, సీమా బిశ్వాస్‌ను మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్సై మహేందర్ తెలిపారు.

విద్యార్థినికి సీఎం ఆర్థికసాయం

జైనూర్: నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేదింటి విద్యా కుసుమం సాయిశ్రద్ధకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన మెస్రం న్యానేశ్వర్ –లక్ష్మి దంపతుల కుమార్తె సాయిశ్రద్ధ నీట్‌లో ఎస్టీ కోటాలో 103వ ర్యాంకుతో మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. పేద కుటుంబం కావడంతో కాలేజీలో చేరేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సాయిశ్రద్ధ పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం సాయిశ్రద్ధ ఎంబీబీఎస్ పూర్తి అయ్యే వరకు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా వైద్యవిద్యకు అవసరమైన పూర్తి మొత్తం ఆర్థికసాయం చేసినట్లు సాయిశ్రద్ధ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.



సాయిశ్రద్ధకు ఆర్థికసాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి

బావిలో పడి వృద్ధురాలు మృతి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): మందమర్రి మండలంలోని కోటేశ్వరరావు పల్లెకు చెందిన సైదం రాజమ్మ(62) అనే వృద్ధురాలు బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సాయంత్రం కాలకృత్యాల కోసం ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూంకు వెళ్లగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో పడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

23,10,190

ఇదీ ఉమ్మడి జిల్లా ఓటర్ల సంఖ్య

- పెరిగిన ఓటర్ల సంఖ్య 91,027
- అప్పుడు.. ఇప్పుడు మహిళా ఓటర్లే అధికం
- ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మంచిర్యాలడెస్క్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఓటు నమోదుపై అవగాహన, ఎన్నికల సంఘం, అధికారులు చేపట్టిన కార్యక్రమాలతో ఓటర్ల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటరు ముసాయిదా జాబితా–2024ను విడుదల చేసింది. పది నియోజకవర్గాల్లో మొత్తం 23,10,190మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 11,31,150 మంది పురుష ఓటర్లు, 11,78,906 మంది మహిళా ఓటర్లు, 134 మంది ఇతరులు ఉన్నారు. 2023 ఎన్నికల సమయంలో ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లా ఓటర్ల సంఖ్య 22,19,163 ఉంది. వీరిలో పురుష ఓటర్లు 10,93,381 మంది, మహిళలు 11,25,65మంది, ఇతరులు 126మంది ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటి ఓటరు జాబితా.. ప్రస్తుత ఓటరు జాబితాను పోల్చి చూస్తే 91,027 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. అప్పుడు.. ఇప్పుడు మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ఇతర ఓటర్లలోనూ స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది.

మహిళలే అధికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ప్రతీ ని యోజకవర్గంలోనూ మహిళలే ఎక్కువగా ఉన్నారు. 2023నాటి జాబితా ప్రకారం మహిళా ఓటర్ల సంఖ్య 11,25,656 ఉండగా.. ముసాయిదా జాబితా ప్రకారం 11,78,906కు పెరిగింది. ఈ లెక్కన 53,250 మంది మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది.

జిల్లాల వారీగా..

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కుమురంభీం ఆసిఫాబాద్	2,27,666	2,29,588	31	4,57,285
మంచిర్యాల	3,23,278	3,29,924	45	6,53,247
ఆదిలాబాద్	2,23,176	2,35,154	8	4,58,338
నిర్మల్	3,57,030	3,84,240	50	7,41,320

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	1,14,708	1,14,896	8	2,29,619
ఆసిఫాబాద్(ఎస్టీ)	1,12,958	1,14,692	16	2,27,666
చెన్నూర్(ఎస్సీ)	96,549	98,383	7	1,94,939
బెల్లంపల్లి(ఎస్సీ)	87,800	89,819	12	1,77,631
మంచిర్యాల	1,38,929	1,41,722	26	2,80,677
ఆదిలాబాద్	1,20,382	1,25,855	6	2,46,243
బోథ్(ఎస్టీ)	1,02,794	1,09,299	2	2,12,095
ఖానాపూర్(ఎస్టీ)	1,10,314	1,15,526	13	2,25,853
నిర్మల్	1,22,553	1,37,040	20	2,59,613
ముథోల్	1,24,163	1,31,674	17	2,55,854

బాస్కెట్‌బాల్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వీసీ గోవర్ధన్

భైంసా: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్ అభినందించారు. బుధవారం ఎంపికైన విద్యార్థులతో కలిసి మాట్లాడారు. బాసర క్యాంపస్‌లో క్రీడారంగాని కి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. క్యాంపస్‌స్థాయిలో ఎంపికైన విద్యార్థులు బెంగుళూర్‌లో జరిగే సౌత్‌జోన్ పోటీల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, శ్యాంబాబు, వసంత, విజయ, రవి, కిరణ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైల్వే జేఈ మృతి



సాయి హిమాన్ష్ మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఏరియా పరిధిలోని రైల్వే కాలనీలో విద్యుదాఘాతానికి గురై రైల్వే జూనియర్ ఇంజినీర్ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం దీపావళి పండుగ నేపథ్యంలో సాయి హిమాన్ష్ (29) తాను నివాసం ఉంటున్న క్వార్టర్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో ఆకస్మికంగా విద్యుత్ సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త సాయి హిమాన్ష్ కళ్లముందే కానరాని లోకాలకు వెళ్లడంతో భార్య అనూష కన్నీరుమున్నీరైంది. వారి స్వస్థలం వరంగల్ జిల్లాలోని రాంపేట గ్రామం. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. మృతుడికి మూడేళ్ల కుమారుడు సాయిరాం ఉన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరస్పరదాడిలో పలువురిపై కేసు నమోదు

బెల్లంపల్లిరూరల్: కుటుంబ కలహాలతో పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో పలువురిపై కేసు నమోదైంది. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన కచ్చు మనీషా అదే గ్రామానికి చెందిన కచ్చు రాజ్‌కుమార్‌ను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరి ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో మనీషా తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి పక్కనే ఆడుకుంటున్న కూతురు సహన్షితో రాజ్‌కుమార్ మాట్లాడుతుండగా భార్య మనీషా, అత్త రాజేశ్వరి దుర్భాషలాడడంతో పాటు రాజ్‌కుమార్, అతని తల్లి వజ్రమ్మలపై దాడికి పాల్పడ్డారు. రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనీషా, రాజేశ్వరిలపై కేసు నమోదైంది. కాగా మనీషా భర్త రాజ్‌కుమార్, మామ భూమయ్య, అత్త వజ్రమ్మ, మరుదులు మహేశ్, రాజశేఖర్‌లు అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు తనపై, తన తల్లి రాజేశ్వరిలపై దాడి చేసి గాయపర్చారని ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.